శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## అక్రమ రవాణా సమాచారం అందజేయాలి
### - టోల్‌ఫ్రీ నెంబర్ 14500ను వినియోగించుకోవాలి



**కోవూరు, నవంబరు 30 ప్రభాతవార్త :** అక్రమంగా మద్యం , గుట్కా, ఇసుక అక్రమ రవాణా వంటి సమాచారం ఉంటే ప్రజలు 14500 నెంబర్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకుని సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఏఈఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి అన్నారు. కోవూరులోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయంలో బుధవారం కోవూరు, ఇందుకూరుపేట, బుచ్చి సెబ్ ఎస్సైలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా మద్యం వంటి నిషేదిత పదార్థాలను అక్రమంగా రవాణా చేయడం పూర్తిస్థాయిలో నేరమన్నారు. దీని వలన శిక్షలు కూడా కఠినంగా ఉంటాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు ఇటువంటి వాటి జోలికి పోకుండా జాగ్రత్త పడాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు శ్రీధర్, శ్రీనివాసులు, అశోక్‌కుమార్, తిరుపాలు తదితరులు ఉన్నారు.

## మోటార్ సైకిళ్లు, బంగారు వస్తువులు స్వాధీనం



**కోవూరు, నవంబరు 30 ప్రభాతవార్త :** కోవూరు పట్టణంలో గత సంవత్సరాల కాలంగా తిరుగుతూ తలుపులు వేసి ఉన్న ఇంటిని గమనించి రాత్రి పూట దొంగతనాలు చేస్తూ తిరుగాడుతున్న జి. రాజేంద్రప్రసాద్ అనే ముద్దాయిని బుధవారం 3 గంటలకు రాజేశ్వరి గుడి ప్రాంతంలో అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 3.30 లక్షలు విలువ చేసే బంగారు, వెండి వస్తువులు, 4.63 లక్షలు విలువ చేసే 3 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని రూరల్ డీఎస్పీ పి. వీరాంజనేయరెడ్డి తెలిపారు. కోవూరులోని సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ కోవూరులో సంవత్సర కాలంగా నివసిస్తూ ఈ ప్రాంతంలో ఇంటికి తాళాలు వేసి ఉన్న వాటిని గుర్తించి అందులో ఉన్న బంగారు వస్తువులు, నగదు చోరీ చేయడమే కాకుండా ఇంటి బయట పార్కు చేసిన ఉన్న 3 మోటార్ సైకిళ్లను ఇటీవల చోరీ చేశాడని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. మద్యం అలవాట్లకు బానిసై ఇటువంటి దొంగతనాలకు పాల్పడడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో చొరవ చూపిన కోవూరు ఎస్సై డి. వెంకటేశ్వరరావు, సిబ్బందిని అభినందించడమే కాకుండా రివార్డు కొరకు జిల్లా ఎస్పీకి సీఫార్సు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు సీఐ కె. రామకృష్ణారెడ్డి, ఎస్సై డి. వెంకటేశ్వరరావులు ఉన్నారు.

## గ్రంధాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన చైర్మన్ దొంతు శారద




**కావలి రూరల్, నవంబరు 30 ప్రభాతవార్త** కావలి వెంగళరావునగర్‌లోని శాఖ గ్రంధాలయాన్ని గ్రంధాలయ సంస్థ చైర్మన్ దొంతు శారద బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, యువత తరచుగా గ్రంధాలయాన్ని సందర్శించి పుస్తక పఠనం ద్వారా జ్ఞాన సంపదను పెంపొందించుకొని పోటీ పరీక్షలలో ఉన్నత ఉద్యోగాలు పొందాలని కోరారు. గ్రంధాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా గ్రంధాలయాన్ని పరిశీలించడం జరిగింది. గ్రంధాలయ అధికారిణి ఎస్.సునీతను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రంధాలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.ఈ సందర్భంగా గ్రంధాలయ కమిటీ సభ్యులు యం.మాలకొండారెడ్డి చైర్‌పర్సన్ దొంతు శారదకు విలువైన పుస్తకాలు అందజేసి అభినందనలు పొందారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సిబ్బంది పి.సుధాకర్, పాఠకులు పాల్గొన్నారు.

## గ్యాస్ లీక్‌తో కాలిపోయిన వస్తువులకు బాధితుడికి రూ. 3.83 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశం



**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 30, ప్రభాతవార్త:** వంట గ్యాస్ లీక్ అయి మంటలు సంభవించి వస్తువులు కాలిపోయిన బాధితుడికి రూ. 3.83 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని నెల్లూరు జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కారాల కమిషన్ ప్రెసిడెంట్ జింకారెడ్డి శేఖర్ బుధవారం తీర్పునిచ్చారు. ఈ మేరకు ఐసీఐసీఐ లంబార్డ్ ఇన్సూరెన్స్ కంపెనీని ఆదేశిస్తూ తీర్పు ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి.

నెల్లూరు జిల్లా ఆత్మకూరు జెఆర్ పేటకు చెందిన మాడపర్తి కిషోర్ ఇంటిలో 2017 డిసెంబరు 16న ఇండేన్ గ్యాస్ సిలిండర్ లీక్ అయి మంటలు వ్యాపించి వస్తువులు కాలిపోయాయి. తమకు నష్టం కలిగినందుకు ఐసీఐసీఐ లంబార్డ్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి రూ. 5.63 లక్షల నష్టపరిహారం అందించాలని వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు.

ఈ మేరకు సీసీ నెంబరు 24/2019 కేసు దాఖలు చేసి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్, ఐసీఐసీఐ లంబార్డ్ ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌ను ప్రతివాదులుగా చేర్చారు. కేసును విచారించిన వినియోగదారుల కమిషన్ ప్రెసిడెంట్ జింకారెడ్డి శేఖర్ సిలిండర్ నుంచి గ్యాస్ లీక్ అవడం వలనే మంటలు వ్యాపించి వస్తువులు కాలిపోయాయని నిర్ధారణకు వచ్చి బాధితుడికి రూ. 3.83 లక్షల నష్టపరిహారం 2017 డిసెంబరు 16వ తేదీ నుంచి 9 శాతం వడ్డీతో చెల్లించాలని, కోర్టు ఖర్చుల నిమిత్తం రూ.5వేలు తీర్పు చెల్లించాలని ఆదేశించారు. ఈ మొత్తాన్ని తీర్పు వెలువడిన 45 రోజుల్లో ఇవ్వాలని స్పష్టం చేశారు. తీర్పు కార్యక్రమంలో వినియోగదారుల కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఇకపై ప్రతి పౌర్ణమి రోజున గరుడ సేవ

**బిట్రగుంట, నవంబరు 30 ప్రభాతవార్త** కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగా శ్రీవారికి గరుడ సేవ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీరాంమాల్యాద్రి, కార్యనిర్వహణాధికారి అరవ రాధాకృష్ణలు తెలిపారు. డిసెంబరు 8వ తేది నుండి గరుడ సేవ మహోత్సవాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు.ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ్యులు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎండోమెంట్ కమిషనర్ హరిజవహర్‌లాల్ పాల్గొంటారన్నారు. ఎమ్మెల్యే సంకల్పం మేరకు ఈ ఉత్సవాన్ని ప్రవేశపెట్టడం జరుగుతుందని తెలిపారు. గరుడ వాహనాన్ని దగదర్తి మండలం ఉప్పలపాడుకు చెందిన అన్నం వెంకట రమణయ్య, పద్మావతి దంపతులు ఆలయానికి బహుకరించినట్లు వారు తెలిపారు.

# జగనన్న విద్యాదీవెనకు రూ.694 కోట్లు విడుదల

**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 30, ప్రభాతవార్త:** పేద విద్యార్థులు కూడా పెద్ద చదువులు చదవాలన్న లక్ష్యంతో ఉన్నత కోర్సులు చదివే పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని జగనన్న విద్యా దీవెన పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా ప్రతి త్రైమాసికం ముగిసిన వెంటనే విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ చెప్పారు. బుధవారం ఉదయం అన్నమయ్య జిల్లా, మదనపల్లి నుంచి జగనన్న విద్యా దీవెన పథకం పూర్తి ఫీజు రీఎంబర్స్‌మెంటు కింద 2022 జులై- సెప్టెంబరు త్రైమాసికానికి 11.02 లక్షల మంది విద్యార్థులకు లబ్ది చేకూరుస్తూ రూ. 694 కోట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు, జంగం కార్పొరేషన్ చైర్‌పర్సన్ వాగులేటి ప్రసన్న, మస్లీం సంచారజాతుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సయ్యద్ ఆసిఫా, బొందిలి కార్పొరేషన్ చైర్మన్ బి.కిషోర్‌సింగ్, సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ ఉపసంచాలకులు వెంకటయ్య, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కనకదుర్గా భవాని, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుతో కలిసి జగనన్న విద్యా దీవెన పథకం కింద జిల్లాలోని 54329 మంది విద్యార్థులకు సంబంధించి రూ. 35.71 కోట్ల మెగా చెక్కును లబ్దిదారులైన విద్యార్థులకు అందజేశారు. ఆనం అరుణమ్మ మాట్లాడుతూ ఉన్నత కోర్సులు చదివే పేద విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన పథకం కింద పూర్తి రీఎంబర్స్‌మెంట్‌ను క్రమం తప్పకుండా ఏ త్రైమాసికం ఫీజు ఆ త్రైమాసికం అయిన వెంటనే చెల్లించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా ఈ రోజు జిల్లాకు సంబంధించి 54329 మంది విద్యార్థులకు సంబంధించి రూ. 35.71 కోట్లు ఫీజు రీఎంబర్స్‌మెంట్ కింద వారి తల్లుల ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జమ చేయడం జరిగిందని తెలుపుతూ, ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల కార్యక్రమం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.



ఈ సంక్షేమ పథకాలను గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన లబ్దిదారులకు పారదర్శకంగా అందించడం జరుగుతుందన్నారు. విద్యారంగానికి సంబంధించి ఎన్నో పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని, పేదరికంతో విద్యార్థులు చదువులకు దూరం కాకూడదనే లక్ష్యంతో పీజీ వరకు అన్ని తరగతుల విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌వమెంట్ కింద పూర్తి ఫీజును చెల్లిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు అండగా ఉంటూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కోవిడ్ సమయంలో విద్యకు సంబంధించి ఇండెక్స్‌లో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. జిల్లాలో బడికి దూరంగా ఉన్న 8వేల మంది పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించి విద్య అందేలా చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. విద్యాపరంగా అభివృద్ధిపరంగా జిల్లాను ముందంజలో నిలిపేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. నేడు అన్ని స్కూల్స్‌లో ఎన్‌రోల్‌వమెంట్ శాతం పెరగడంతో పాటు ఉత్తీర్ణతా శాతం కూడా పెరిగిందని కలెక్టర్ వివరించారు. నాడు నేడు కార్యక్రమం కింద రెండో విడత 1390 స్కూల్స్‌లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు పనులు చేపట్టడం జరిగిందని, వచ్చే ఫిబ్రవరి నెల నాటికి ఆ పనులు పూర్తి కావడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. గతంలో నా విద్యకు ఫీజు చెల్లించే సమయంలో మా తల్లిదండ్రులు అనేక ఇబ్బంఉలు పడేవారని, ప్రస్తుతం మాకు ఫీజు కట్టాలి అనే బాధ తప్పింది. రాష్ట్ర ప్రభుత్వమే విడతల వారీగా కోర్సుకు సంబంధించి ఫీజు చెల్లిస్తుంది. మా లాంటి పేదలకు ఉన్నత విద్యకు సాయం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# రోడ్డు సేఫ్టీ పోలీసుల బాధ్యత

**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 30, ప్రభాతవార్త:** ప్రజల ప్రాణాలు కాపాడడానికి రోడ్డు సేఫ్టీ నెల్లూరు పోలీసుల బాధ్యత అని జిల్లా ఎస్పీ విజయరావు అన్నారు. నెల్లూరు జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం విధి నిర్వహణలో అప్రమత్తంగా, నిబద్ధతతో వ్యవహరించాలని సమావేశంలో పోలీసులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి నిర్వహించబోయే ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని అమలుపరచాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రత్యేకంగా జిల్లాలో ఉన్న 7 రోడ్డు సేఫ్టీ నెల్లూరు పోలీసు అధికారులు ప్రజల ప్రాణాలు కాపాడడమే రోడ్డు సేఫ్టీ నెల్లూరు పోలీసు అధికారులు ప్రజల ప్రాణాలు కాపాడడమే రోడ్డు సేఫ్టీ నెల్లూరు పోలీసుల ప్రధాన ధ్యేయమని, బ్లాక్ స్పాట్ పరిధిలో అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు తగ్గించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని, హెల్ప్‌లైన్ ద్వారా అందే కాల్స్‌కు వెంటనే స్పందించి రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారిని రక్షించాలని, హైవేల మీద, డాబా హోటల్స్ వద్ద ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు రోడ్డు మీద పార్కింగ్ చేయరాదని, అలా పార్కింగ్ చేయబడిన వాహనాలను పరిధిలోని ఎస్ఐల సహకారంతో సీజ్ చేయలని ఆదేశించారు. నైట్ పెట్రోలింగ్‌లో విజిబిలిటీ కోసం రోడ్డు సేఫ్టీ నెల్లూరు పోలీసులు తప్పనిసరిగా రేడియం లైట్స్, రేడియం జాకెట్స్, టార్చ్‌లైట్‌లు ఉపయోగించాలని తెలిపారు. హైవే మీద రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు కిడ్నాప్‌లు, దొంగతనాలు, ఇతర నేరాలు జరిగినప్పుడు రోడ్డు సేఫ్టీ నెల్లూరు పోలీసులు అన్ని కూడా కంట్రోల్ రూం ఆదేశాలను అనుసరించి సమన్వయంతో పని చేయాలని, వారి వారి పరిధిలలో మొబైల్ విజిబులిటీ గణనీయంగా పెంచాలని, అన్ని రోడ్డు సేఫ్టీ నెల్లూరు పోలీసుల కదలికలను ఎప్పటికప్పుడు జిపిఎస్ ద్వారా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, విధులలో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా హెచ్చరించారు. బాగా పని చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు.



# ఆక్రమిత ప్రభుత్వ భూములను పరిశీలించిన జెసి

**వింజమూరు,నవంబర్30ప్రభాతవార్త:** వింజమూరు మండలం కాటేపల్లి పంచాయతీ పరిధిలోని ఆక్రమిత ప్రభుత్వ భూములను బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మానాథ్ పరిశీలించారు. ముందుగా తహసిల్దార్ కార్యాలయానికి విచ్చేసి కాటేపల్లి పంచాయతీకి సంబంధించిన భూ రికార్డులతో గ్రామానికి విచ్చేసి భూములను పరిశీలించారు. అనంతరం కాటేపల్లిలో ని రైతు భరోసా కేంద్రంలో గ్రామస్తులతో సమావేశమయ్యారు. జాయింట్ కలెక్టర్ కూర్మానాథ్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన కొందరు ప్రభుత్వ భూములను, వంక, వాగు, కొండ, పోరంబోకు భూములను ఆక్రమించుకొని పంటలను సాగుచేస్తూ మూగజీవాలకు మేత లేకుండా చేస్తున్నారని గ్రామానికి చెందిన కుండా నారాయణ, వల్లూరు రమేష్‌లు, కొందరు గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఈసందర్భంగా పిటిషన్‌దారుల ఫిర్యాదును పరిశీలించాలని అధికారులను ఆదేశించడంతో గ్రామంలోని భూములను బుధవారం పరిశీలించామన్నారు. గ్రామస్తులు వారికున్న సమస్యలను సభదృష్టికి తేవాలని కోరారు. దాంతో పిటిషన్ దారులు కుండా నారాయణ, వల్లూరు రమేష్ మాట్లాడుతూ గ్రామంలోని కొందరు, బయట ప్రాంతాలకు చెందిన వారు కొందరు అసైన్‌మెంట్ పట్టాలు పొంది వారికి సమీపంలోని ప్రభుత్వ భూములను కూడా కలుపుకొని సాగుచేసుకుంటూ పశువులకు, జీవాలకు మేత దొరకకుండా చేస్తున్నారన్నారు. స్పందించిన జెసి ప్రభుత్వ భూమి పంచాయతీపరిధిలో 1277ఎకరాలు మేత పోరంబోకు ఉందని దానిజోలికి ఎవరూ వెళ్ళరాదని, అలా చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అలాగే గ్రామంలో అర్హులైన వారికి ప్రభుత్వ భూమిని పంచుతామని ఆయన తెలిపారు. ప్రభుత్వా ఆస్తులైన వంకలు, వాగులు, కొండలు, కోనలు, కొండ పోరంబోకు తదితరాలను ఆక్రమించి ఉంటే వెంటనే వాటిని స్వచ్ఛందంగా తొలగించాలని లేనిచో శాఖపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈసందర్భంగా కొందరు రైతులు ఏక్‌సాల్ లీజు పొంది కొన్నేళ్ళుగా బోర్లు వేసుకొని సాగుచేసుకుంటున్నారని వారికి న్యాయం చేయాలని గ్రామానికి చెందిన బండి కృష్ణారెడ్డి, మండాది గోవిందరెడ్డిలు జెసిని కోరారు. అర్హులందరికీ న్యాయం చేస్తామని జెసి తెలిపారు. గ్రామంలోని సచివాలయ నిర్మాణం పూర్తయి ప్రారంభంకూడా అయ్యిందని కానీ పాఠశాల ఆవరణలో ఉందనే ఉద్దేశంతో సచివాలయం మూతపడిందన్నారు. సచివాలయ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. సంబంధింత సమస్యను వెంటనే పరిష్కరించాలని తహసిల్దార్‌ను జెసి ఆదేశించారు.తహసిల్దార్ చొప్పా రవీంద్రబాబు, ఎఎస్ఎఫ్ఎ అధికారిణి ఆసీఫా, డిఐఒ వాసు, ఆర్ఐ శిరాజ్, సర్వేయర్ ఖాదర్‌హుసేన్ ,సచివాలయ సిబ్బంది నిఖిత, శిరీష, స్పందన, కిరణ్‌కుమార్,



## నాడు-నేడు పనులు పరిశీలించిన క్వాలిటి కంట్రోల్ అధికారులు



**సీతారామపురం నవంబర్ 30 ప్రభాతవార్త** సీతారామపురం మండలంలోని బసినేనిపల్లి ,సీతారామపురం, ఓగురువాండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పథకం కింద రెండోవ దశ పనులను క్వాలిటి కంట్రోల్ ఏపిఇడబ్ల్యూఐడిసి ఇఇ శ్రీనివాస్‌కుమార్ ,డిఇఇ మహేంద్ర బుధవారం పరిశీలించారు. జరిగిన పనులపై సంతృప్తి వ్యక్త పరచారు. నిధులకు సంబంధించి రిజిష్టర్లు తనీఖి చేశారు.పనులను నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరగతిన పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచించారు.ఈకార్యక్రమంలో ఎంఇఒ మస్తాన్‌వలి,ప్రధానోపాధ్యాయులు పి సుధాకర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సిఆర్‌పిలు,పేరంట్స్ కమీటి చైర్మన్లు గుత్తేదారులు తదితరులు పాల్గోన్నారు.

# రావూస్‌లో జాతీయ ఓటరు అవగాహన సదస్సు

**నెల్లూరు,నవంబరు30 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్థానిక రావూస్‌డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ ఓటరు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్య భారతదేశంలో ఓటరుగా నమోదు కావటం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిని ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలన్నారు. దేశ ఎన్నికల సంఘం రూపొందించి సిస్టమాటిక్‌వోటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ లో భాగంగా ప్రజలకు ఓటు హక్కు పై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగిందన్నారు. అందరూ ఓటు హక్కును కలిగి ఉండి దేశ భవిష్యత్‌లను నిర్ణయించే శక్తిగా యువత ఎదగాలని కోరారు.అలాగే తమ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఓటరు లిస్టులో మార్పులు, తప్పుల సరవణ, వివరాల మార్పు తదితర వాటిని మార్పు చేసుకునే అవకావం ఉందన్నారు.దీనిని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రావూస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై.కోటేశ్వరరావు మాట్లాడుతు ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉంచే ఆయుధం ఓటుహక్కు అని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువత బాధ్యతగా వారి ఓటు హక్కుకోసం నమోదు చేసుకోవాలని సూచించారు. యువత ముందుకు వచ్చినప్పుడే దేశ అభివృద్ధి సాధ్యమౌతుందన్నారు. ఈ కార్యక్రమంలో రావూస్ విద్యాసంస్థల డైరెక్టర్ వై.శివసంకేత్,శివారెడ్డి, కార్పోరేషన్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ఉప విద్యాధికారి ఆకస్మిక తనిఖీ



**బుచ్చి నవంబర్ 30 ప్రభాతవార్త:** మండలంలోని దామరమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా ఉప విద్యాధికారి భిక్షాలు ఆఖస్మిక తనీఖీ నిర్వహించారు. రెండోవదశ నాడు-నేడు పనులను ఈ సందర్భంగా పరిశీలించారు.జరుగుతున్న పనుల తీరును ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.తరగతిగదిలో విద్యార్థులతో ముచ్చటించారు.పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు చేస్తున్న బోదనను ఆయన పరిశీలించారు. విద్యార్థులు కొందరు ఆంగ్లంలో మాట్లాడడాని న్ని చూసి అభినందించారు. వర్చ్యువల్ తరగతులు పాల్ల్యాబ్‌లు సైన్స్ ల్యాబ్‌లు పరిశీలించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌తోపాటు ఉపాధ్యాయులతోమాట్లాడుతు పాఠశాలను ప్రతి ఒక్కరు ఒక కుటుంబంలాగా భావించాలని ,భాద్యతను విస్మరించకూడదని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

## యువతరానికి స్ఫూర్తి ఫ్రెండ్స్ ఫౌండేషన్



**కావలి, నవంబరు 30 ప్రభాతవార్త:** ఫ్రెండ్స్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు యువతరానికి స్ఫూర్తిదాయకమని కావలి ఆర్డీవో శీనానాయక్ తెలిపారు. మండల స్థాయి వ్యాసరచన పోటీలో విజేతగా నిలిచిన బ్రాహ్మణక్రాక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని కె.ఉత్పలప్రియను బుధవారం అభినందించి ప్రశంసాపత్రం, మెమోంటో, మెడల్, పలు బహుమతులు ఆర్డీవో అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫ్రెండ్స్ ఫౌండేషన్ పలు సేవా కార్యక్రమాలతో పాటు హాస్టల్ విద్యార్థులకు ట్యూషన్ పాయింట్స్ నిర్వహించడం, పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వడం లాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతైనా అభినందనీయమన్నారు.ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు మహేష్, వినయ్, హరి, సంస్థ గౌరవ సలహాదారులు అన్నవరం హనుమకుమార్, ఉపాధ్యాయులు రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కావలి డిఎస్పీ వెంకట రమణను సత్కరించిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు



**కావలి, నవంబరు 30 ప్రభాతవార్త:** కావలి డిఎస్పీ కార్యాలయంలో నూతన డిఎస్పీ యం.వెంకట రమణను బుధవారం కావలి పట్టణంలోని స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. పూలబొకెలు, పూలమొక్కలు అందజేసి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షులు షేక్ ఖాదర్‌బాషా, ది వాయిస్ ఆఫ్ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు మొగల్ సలీం బేగ్, హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు వివిఎస్ఆర్, మాల్యాద్రి, మీ కోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు రాయపాటి దిలీప్‌కుమార్, ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షురాలు షేక్ ఖాదర్‌బీ, హ్యాపీ సేవా సంస్థ సయ్యద్ ఘనీబాషా, లోక్‌సత్తా మాలకొండారెడ్డి, జాగో సేవా సంస్థ జమీర్, పరివర్తన సేవా సంస్థ యం.డి.రెహ్మాన్, ది మువ్‌మెంట్ ఫర్ ఫీస్ జస్టిస్ షేక్ రఫి, విశ్రాంత ఉపతహశీల్దార్ మొగల్ సిరాజ్‌బేగ్, గుడ్‌మెన్ ఛారిటబుల్ ట్రస్ట్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొని మాట్లాడారు.

## ముస్లింల మధ్య కలహాలు రేపాలని చూస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



**నెల్లూరు నవంబర్ 30, ప్రభాతవార్త-వైద్యం:** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి.శ్రీధర్‌రెడ్డి ముస్లింల మధ్య చిచ్చు పెట్టి, విభజించి పాలించు అన్న చందాన రాజకీయ పబ్బగడుపుకోవాలని చూస్తున్నాడని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి హయత్‌బాబా, సాభిర్‌ఖాన్‌లు ఆరోపించారు. బుధవారం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ముస్లింల ఓట్ల కోసం వారి మధ్య కలహాలు రేపి రాజకీయ లబ్ధిపొందాలని శ్రీధర్‌రెడ్డి చూస్తూ సమీని రెచ్చగొడుతున్నాడని మండిపడ్డారు. వైసీపీ కార్పొరేటర్ సత్తార్ స్థలాన్ని కబ్జా చేశాడని చెపితే వైసీపీ వారు స్పందించలేదని, ఐఎన్ఎల్ పార్టీ వారిని పిలిచి మాట్లాడిస్తున్నారని విమర్శించారు.

సమీ మీడియా సమావేశం పెట్టి వార్నింగులిస్తున్నాడని అన్నారు. ఇలాంటి వాళ్ళు ముస్లిం సమాజాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని వెల్లడించారు. సత్తార్ వైసీపీకి చెందిన వ్యక్తని, తాము టీడీపీకి చెందని వారమని మా మధ్య జరుగుతున్న దాంట్లో నీకు ఏమి సంబంధమని సమీని సూటిగా ప్రశ్నించారు. నోరు తెరిస్తే తమ కలహాలు, మతాల మధ్య తగవులు వచ్చేలా మాట్లాడుతున్నాడని విమర్శించారు. మీపార్టీ గురించి నువ్వు చూసుకోవాలే కాని వైసీపీ ఎమ్మెల్యే మంచివాడని సమీ కితాబు ఇవ్వడం ఏమిటన్నారు. రూరల్‌లో టీడీపీ బలంగా ఉందన్న దానికి ఇది నిదర్శనమన్నారు. ఒక ప్రబుద్ధ మీడియా సమావేశం పెట్టి ఇష్టమొచ్చినట్లు కారు కూతలు కూస్తున్నాడన్నారు. కాంగ్రెస్ పార్టీతో చుప్కే, బిజేపీతో చుప్కే, ఎంఐఎంతో చుప్కే ఇంకా నెల్లూరులో ఉండే ఏదైనా చిన్న చితక పార్టీలతో చుప్కే చివరికి ఇల్లీగల్ నేషనల్ లీగ్ పార్టీతో చుప్కే అయిన సమీ కూడా మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సత్తార్ చేసిని తప్పుని సరిదిద్దుకోవాలని లేనిపక్షంలో మస్తానమ్మకు న్యాయం జరిగే వరకు టీడీపీ తరపున పోరాటం చేస్తామని, మానేత అయిన అబ్దుల్‌అజీజ్ గురించి మాట్లాడే అర్హత క్షణానికి ఒక పార్టీ నీకు లేదని ఇకనైనా సమీ అదుపులో పెట్టుకుని మాట్లాడాలని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో అబ్దుల్ మస్తాన్, అస్లం, దావూద్, రబ్బానీ, సల్మాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ పోరాటం




**కావలి, నవంబరు 30 ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తోందని సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య హెచ్చరికలు చేశారు. కావలి పట్టణం రైల్వే స్టేషన్ రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అక్టోబరు మాసంలో విజయవాడలో సిపిఐ జాతీయ మహాసభలు జరిగాయన్నారు. అందులో భాగంగా జిల్లాల వారిగా జనరల్ బాడీ సమావేశాలు, పార్టీ సమీక్షా సమావేశాలు జరుగుతున్నాయన్నారు.

డిసెంబరు 2వ తేది కావలి స్పందన కళ్యాణమండపంలో సిపిఐ పార్టీ జిల్లా జనరల్ బాడీ సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జిల్లా కార్యదర్శి పి.జగదీష్‌లు హాజరవుతారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజాకంఠక పాలనపై వారు మాట్లాడతారన్నారు. జగనన్న ఇళ్ళ పేరుతో లబ్దిదారులకు లక్షా 80 వేల రూపాయలు ఇస్తున్నారని ఈ నిధులతో ఇళ్ల నిర్మాణం ఎలా సాధ్యపడుతుందన్నారు. ఇసుక, స్టీలు, సిమెంటులను ప్రభుత్వం విపరీతంగా పెంచిందన్నారు.

అందుచేత ప్రతి లబ్ధిదారుడికి ఇంటికి ఏడు లక్షల రూపాయల వంతున నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడున్నర సంవత్సరాలు అవుతున్నప్పటికీ టిడ్కో ఇళ్ళను నేటికీ లబ్దిదారులకు ఇవ్వలేదన్నారు. దీనిపై డిసెంబరు 5వ తేది మున్సిపల్ కార్యాలయాల్ని సిపిఐ ఆధ్వర్యంలో ముట్టడించడం జరుగుతుందని హెచ్చరించారు. రైతులకు గిట్టుబాటు ధరలతో ఎరువులను సకాలంలో అందించాలన్నారు. రైతుల మోటార్లకు మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ డిసెంబరు 12వ తేదిన నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. దెబ్బతిన్న రోడ్లను వెంటనే వేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా రైతు సంఘం నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు కొప్పర్తి నాగరాజు, చేవూరు కొండయ్య,పాల్గొని మాట్లాడారు.

## నేడు గుడ్లూరులో టీడీపీ ఆధ్వర్యంలో ఇదేం కర్మ కార్యక్రమం

**గుడ్లూరు, నవంబరు 30, ప్రభాతవార్త :** గుడ్లూరు గ్రామ పంచాయతీ నందు టీడీపీ ఆధ్వర్యంలో గురువారం ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి టీడీపీ కందుకూరు నియోజకవర్గ ఇంఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు హాజరవుతారని అన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు, అబిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## మహిళలకు చీరలు పంపిణీ చేసిన కనమర్లపూడి



**కావలి, నవంబరు 30 ప్రభాతవార్త:** కావలి పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం వాసవీ క్లబ్ మహిళలకు నెల్లూరు జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కనమర్లపూడి సుబ్రమణ్యం(సురేష్) చీరలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకుడు పేరకం వేణుగోపాల్, వనితా క్లబ్ అధ్యక్షురాలు అనుమాలశెట్టి కామాక్షి, కార్యదర్శి ఇన్నమూరి హేమలత, ట్రజరర్ అమరా విజయలు పాల్గొన్నారు.

## కొవిడ్‌కు ముందు ఆగే రైళ్లు అన్ని బిట్రగుంటలో నిలుపుదల చేయాలి



**బిట్రగుంట, నవంబరు 30 ప్రభాతవార్త:** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో కొవిడ్‌కు ముందు నిలుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ నిలుపుదల కోసం చర్యలు తీసుకోవాలని రైల్వే మజ్దూర్ యూనియన్ బిట్రగుంట శాఖ కార్యదర్శి నవీన్‌కుమార్ కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి బుధవారం రాత్రి వినతి పత్రం అందజేశారు. కొవిడ్‌కు ముందు నిలిపివేసిన ఎక్స్‌ప్రెస్ రైళ్లు అన్ని క్రమబద్ధీకరించినప్పటికీ బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో ఈ రైళ్ళను ఆపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ బిట్రగుంట శాఖ ఉపాధ్యక్షులు మద్దిబోయిన శేఖర్, వైసిపి మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు యాదవ్, ఎంపిటిసి సుందర్‌రాజ్, వైసిపి నేత మేకల శ్రీనివాసులు తదితరులు వున్నారు.

## నేడే ఎల్ఆర్ఎస్ మేళా

**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 30, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)లో గతంలో దరఖాస్తు చేసిన డాక్యుమెంట్స్ షార్ట్ ఫాల్స్, ఫీజులు చెల్లించేందుకు డిసెంబర్ 1న ఎల్ఆర్ఎస్ మేళాను నెల్లూరు నగరపాలక సంస్థ ఆవరణలోని పురసేవ మిద్దె పైన నిర్వహించనున్నట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలియజేయడమైనది.






## మంచు దుప్పటి

పది రోజులుగా జిల్లాలో మంచు అధికంగా కురుస్తోంది. దీనికితోడు చలిగాలులు తీవ్రంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చలిగాలుల ధాటికి శ్వాసకోశవ్యాధులు అధికమై ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు.

ఫోటోలు: నందా మాల్యాద్రి






## వెంగారెడ్డిపాళెంలో గ్రామ సభ



**సంగం నవంబర్ 30 ప్రభాతవార్త:** సంగం మండలం వెంగారెడ్డిపాళెం గ్రామంలోని పంచాయితీ కార్యాలయం నందు గ్రామ సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ ఉపాధీహామి పనుల గురించి, పక్కాగృహాల మంజూరు గురించి ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గంపకుమార్, సిహెచ్ లక్ష్మీ ప్రసన్న, పంచాయితీ కార్యదర్శి లక్ష్మీ్మలావణ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివారెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ లావణ్య, ఎపిఒ వెంకటనారాయణ, టిఎ నరసయ్య, కృష్ణారావు, ఎన్‌ఆర్‌జిఎస్ నరేష్, వాలింటర్లు పాల్గోన్నారు.

## మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



**బిట్రగుంట, నవంబరు 30 ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యుత్ సంస్థలో మీటర్ రీడర్లుగా పనిచేస్తున్న వారికి పీస్ రేటు రద్దు చేసి వారి సర్వీసులను క్రమబద్ధీకరించాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి మీటర్ రీడర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రవిచంద్ర వినతి పత్రాన్ని అందించారు. గత 20 సంవత్సరాలుగా పీస్‌రేటు ప్రాతిపదికపై రాష్ట్రంలో 4 వేల 500 మంది మీటర్ రీడర్లు పనిచేస్తున్నారన్నారు. అయితే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో నేను వున్నాను, నేను విన్నాను అని ప్రభుత్వం అధికారంలోకి రాగానే సర్వీసులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చారని అలాగే అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి కొన్ని నెలలు అవుతున్నా వారికి ఉద్యోగ భద్రత కల్పించలేదన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి స్పందిస్తానని తెలిపారు.

## నేడు సాయినాదుని ఆలయంలో ప్రత్యేక పూజలు

**వరికుంటపాడు, నవంబర్30, ప్రభాతవార్తః** మండల కేంద్రమైన వరికుంటపాడులో ఉన్న సాయిబాబా ఆలయంలో గురువారం శంకర వెంకటాద్రి సుజన దంపతుల మనువడైన సాయివిరాట్ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజలతోపాటు సాయంత్రం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ వ్యవస్థాపకులు శంకర వెంకటాద్రి ఒక ప్రకటనలో తెలిపాడు. ప్రత్యేక అభిషేకాలు, హోమాలు నిర్వహిస్తున్నందున సాయిబాబా భక్తులందరు పాల్గొని సాయినాదుని కృపకు పాత్రులు కాగలరని కోరారు.

## జగనన్న విద్యాదీవెన విద్యార్థులకు వరం



**కోవూరు, నవంబరు 30 ప్రభాతవార్త :** ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదవాలనే ప్రధాన ధ్యేయంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విద్యాదీవెన పథకం ప్రవేశపెట్టారని కోవూరు జెడ్పీటీసీ సభ్యురాలు కె. శ్రీలత తెలిపారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో జగనన్న విద్యాదీవెన నిధుల విడుదల కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేవలం పేదరికం కారణంగా చదువు ఆపకూడదనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఏఎస్‌డబ్ల్యూ మనోజ్ మాట్లాడుతూ ఈ పథకాన్ని అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా ప్రభుత్వం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని, వాటిని వారు డ్రా చేసి సంబంధిత కళాశాలకు అందజేయాలన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు నరసింహులురెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి ఈ పథకాన్ని పూర్తిస్థాయలో సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వంలో ఈ నిధులు విద్యార్థులకు అరకొర వరకు అందేవని, ప్రస్తుత ముఖ్యమంత్రి మాత్రం 4 సంవత్సరాలకు సంబంధించిన ఫీజ్‌ను క్రమం తప్పకుండా విద్యార్థుల తల్లుల ఖాతాలో జమచేయడం జరిగిందన్నారు. పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పాదయాత్రలో విద్యార్థుల కష్టనష్టాలు తెలుసుకుని ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ వై. విజయ, ఎంపీటీసీ సభ్యులు రాజగోపాల , బాబురావు, రాజేశ్వరి, సీహెచ కళ్యాణి, టి. సుప్రజ, పి. శ్రీనివాసులురెడ్డి, సంక్షేమాధికారులు నాగరాజు, వెంకట్రావు, పద్మ, మేరీ సుప్రజ, దయాకర్, తదితరులు ఉన్నారు.

## హక్కులు, బాధ్యతలపై అవగాహన చేసుకోవాలి



**కోవూరు, నవంబరు 30 ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు రాజ్యాంగం ద్వారా ప్రసాదించిన హక్కులు, బాధ్యతలపై పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలని కోవూరు తహసీల్దార్ ఎం. పద్మజ తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని రామచంద్రాపురం కాలనీలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి అనేక పథకాలు ప్రవేశపెడుతుందని వాటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు ఏ ప్రాంతంలోనైనా ఎస్సీ, ఎస్టీలను అంటరానివారిగా చూడడం చట్టరీత్యా నేరమన్నారు. అటువంటి విషయాలను ప్రోత్సహించిన వారిపై కూడా శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. ఇటువంటి పౌరహక్కుల దినాన్ని ప్రతి నెల ఎస్సీ, ఎస్టీ ఏరియాలో నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాజ్యాంగంలో పొందుపరచివున్నారన్నారు. ఎస్టీ , ఎస్సీ ఏరియాలో ఎక్కడైనా దళితులు గాని, గిరిజనులు గాని ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా వారికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అలాంటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్ధారు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర ్పంచ్ వై. లక్ష్మీకుమారి, ఏపీఎం వెంకటస్వామి, పంచాయతీ కార్యదర్శి కరుణ, రెవెన్యూ వీఆర్వో జయరాజ్, గ్రామస్తులు ఉన్నారు.

## యూటీఎఫ్ నాయకులపై బైండోవర్ కేసులు సరికాదు



**కోవూరు, నవంబరు 30 ప్రభాతవార్త :** రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రభుత్వ వ్యతిరేక చర్యల పట్ల తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని నిర్వీర్యం చేయడం సరైనది కాదని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు కె. నాగిరెడ్డి, ఎస్‌కే ఖాజావలిలు పేర్కొన్నారు. కోవూరులో బుధవారం వారు మాట్లాడుతూ విజయవాడలో ధర్నా కార్యక్రమానికి అనుమతి ఇచ్చినట్లే ఇచ్చి అన్ని ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు ధర్నాకు రాకుండా రాత్రివేళలో వారి ఇంటికి వెళ్లి బైండోవర్ నోటీసులు ఇవ్వడం అమానుష చర్య అన్నారు. ఇటువంటి పద్దతిని మానుకోవాలని ఈ సందర్భంగా వారు హితవు చెప్పారు.

## ఆర్‌పిఐ పార్టీ జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక



**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 30, ప్రభాతవార్త:** శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు సంబంధించి నగరంలోని స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో ఉండే ఆర్‌పిఐ జిల్లా పార్టీ కార్యాలయం నందు బుధవారం నెల్లూరు పార్లమెంటు జిల్లా అధ్యక్షులు షేక్ మాబు నూతన కార్యవర్గాన్ని వెల్లడించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొవ్వూరు సురేష్, జిల్లా ఉపాధ్యక్షులుగా యు. మాలకొండయ్య, బత్తల మధు, మహదేవా, సుబ్బారావు, రామయ్య, ఎస్. కె. నాగూర్, జిల్లా కార్యదర్శులుగా గంటాజాన్ కిరణ్, పాండురంగారావు, వల్లూరు ధనుంజయ, ఓజిలి భాస్కర్, కార్యనిర్వహణ కార్యదర్శిగా నేనావత్ రవికుమార్, జిల్లా అధికార ప్రతినిధులుగా ఐటిబి షేక్ షావుల్ హమీద్, మల్లికార్జున్ గౌడ్, ప్రచార కార్యదర్శులుగా గుర్రం రాజేష్, మల్లికార్జున, సోనంగి ధనయ్య, దాసరి రత్నం, జిల్లా కార్యవర్గ సభ్యులుగా తలారి వెంకటయ్య, కె. ప్రసన్నకుమార్, ఎస్. డి. తాజుద్దీన్, పేనేటి సాయిరాజేష్, కె. చిరంజీవి, ఎస్. డి. ఎస్థాని, చెముడుగుంట డెన్ని, కె. పోలయ్య, ఎస్. కె. ముజీబ్, అనుబంధ సంఘాలు ఆర్‌వైఎఫ్ఐ యూత్ జిల్లా అధ్యక్షులుగా ముసలి జయరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా దూడల రాము, స్టూడెంట్ జిల్లా అధ్యక్షులుగా బి. శ్రీధర్‌లను ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన ప్రకటించారు.

## జగనన్న కాలనీలో అట్టహాసం గృహప్రవేశాలు



**ఇందుకూరుపేట నవంబర్ 30 ప్రభాతవార్త:** ఇందుకూరుపేట మండలం కొమరిక గ్రామంలో జగనన్న కాలనీలలో గృహనిర్మాణాలు పూర్తి చేసి డిసెంబర్ 21న గృహప్రవేశాలు చేయడం జరుగుతుందని ఆశా ఏఇ వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. బుధవారం లబ్దిదారులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేసి నిర్మాణాలకు సంబంధించిన నమూనా ఫోటోలను ప్రదర్శించారు. స్థానిక నేత గూడూరు శివకుమార్‌రెడ్డి మాట్లాడుతు గృహనిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసి ముఖ్యమంత్రి సంకల్పించిన డిసెంబర్ 21 కార్యక్రమాన్ని తమ గ్రామంలో విజయవంతం చేస్తామని తెలిపారు.

## రాష్ట్రాస్థాయి పోటీలకు ధరఖాస్తుల ఆహ్వానం

**ఇందుకూరుపేట నవంబర్ 30 ప్రభాతవార్త:** ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు డైట్ కళాశాలలో డిసెంబర్ 8,9 తేదిలలో రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పోటీలకు ఎయిడెట్ ప్రవేటు ,కేజీ. బివి, ఏపి మోడల్ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల బాలబాలికలు అర్హులని తెలిపారు. ఈ పోటీలలో పది కళారూపాయాలు ఉంటాయని అందులో గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, నాట్యం, సాంప్రదాయ ఆటబొమ్మలు, ఏకపాత్రాభినయ నాటకం తదితర ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఒక్కోక్క విద్యా సంస్థ నుండి ఆయా విభాగాలకు ఒక బాలుడు, ఒక బాలిక మాత్రమే పోటీలకు అర్హులని అన్నారు. గతంలో నిర్వహించిన పోటీలలో ప్రధమ, ద్వితీయ బహుమతులు సాధించిన వారు ఈ పోటీలకు అనర్హులని తెలిపారు. ఆసక్తి కలవారు పొల్గనవచ్చునని తెలిపారు. ఫోన్‌నెంబర్లు డి నరసింగరావు ,ఎస్ నరసింహమూర్తి, ఎన్ శివా, కె విజయ్ చంద్ర , 9490369743, 9493235789, 9959138791 ఆనెంబర్లు సంప్రదించాలని వారు కోరారు.

## అయ్యప్పఆలయంలో అన్నదానం



**వింజమూరు, నవంబర్30ప్రభాతవార్త:** వింజమూరులోని ప్రసన్నారెడ్డినగర్‌లో వెలసియున్న అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని అయ్యప్ప భక్తబృందం ఏర్పాటు చేశారు. ముందుగా అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప ఊరిబిక్ష ద్వారా సేకరించిన వస్తువులతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో గురుస్వాములు చేబ్రోలు వసంతరావ్, ప్రసాద్, డివి, దేవర, మస్తాన్‌రెడ్డి, మనం హరీష్, వెలుగోటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రీనగర్ అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం



**వింజమూరు, నవంబర్30ప్రభాతవార్త:** వింజమూరులోని గాయత్రీనగర్‌లో వేంచేసియున్న అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం మద్దూరి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మద్దూరి బాలక ృష్ణారెడ్డి భార్య అనీలకుమారి, కుమారుడు జయచందు, కుమార్తె శాలిని మరియు కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ముందుగా వేదగాయత్రీ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప ఆలయంలో శివలింగానికి పూజలు , వినాయకుని అష్టోత్రం, సుబ్రహ్మణ్య స్వామి పూజలు నిర్వహించి అయ్యప్పకు కర్పూరహారతి నిరాజనం ఇచ్చారు. అన్నదాన కార్యక్రమానికి ఆలయ ధర్మకర్త మద్దూరి గోపాల్‌రెడ్డి, గురుస్వామి రామకృష్ణ, ఆలా రమణయ్య, వైసిపి మండల కన్వీనర్ రేవునూరి శ్రీనివాసులు రెడ్డి, సొసైటీ చైర్మెన్ జూపల్లి రాజారావ్, పిఎసిఎస్ మాజీ చైర్మెన్ మద్దూరి చిన్నికృష్ణారెడ్డి, నాయకులు బయపురెడ్డి విజయకృష్ణారెడ్డి, అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, జడ్. మోహన్‌రెడ్డి, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి



**సీతారామపురం నవంబర్ 30 ప్రభాతవార్త:** జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఇఒపిఆర్‌డి భార్గవి తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా గ్రౌండ్ ట్రోటింగ్ ప్రక్రియలో సీతారామపురం గ్రామ పంచాయితీలోని పండ్రింగి గ్రామం లోని ఖాళీ స్థలాను రోవర్ ద్వారా సర్వే చే యడం జరిగిందని తెలిపారు. గ్రామ కంఠంలోని ప్రతి ఖాళీ స్థలాన్ని ఇంటిని సర్వే చేసి సంబంధిత రికార్డులను ఉన్నతా ధికా రులకు సమర్పించి లబ్ధిదారులకు ప్రాపర్టికార్డు అందే విధంగా ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో సీతారామపురం గ్రామ పంచాయితీ సర్పంచ్ భాగ్యమ్మ, పంచాయితీ కార్యదర్శి జీవన్, సర్వేయర్‌లు వాలింటరీలు గ్రామ ప్రజలు పాల్గోన్నారు.

## అజీజ్.. నోటి దురుసు అదుపులో పెట్టుకో



**నెల్లూరు టౌన్, నవంబరు 30, ప్రభాతవార్త:** జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ ఈ నెల 28వ తేదీ సోమవారం నాడు కార్పొరేటర్ సత్తార్ సాహెబ్ గురించి విమర్శలు చేశావు అంతవరకూ సరే బాగు ంది. సత్తార్‌ను గుడ్డలు విప్పి కొడతానని అన్నావు కదా ఇదే నీ నోటి దురుసు దాన్ని అదుపులో పెట్టుకో లేకుంటే సరైన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, నేను చెబుతున్న అబ్దుల్ అజీజ్ నీకు దమ్ము, ధైర్యం, ఖలేజా ఉంటే సత్తార్‌ను నేను తీసుకుని ఒంటరిగా వస్తాను సమయం, స్థలం నువ్వు చెప్పు అజీజ్ అంటూ ఇండియన్ నేషనల్ లీగ్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సమీ హుస్సేనీ సవాలు విసిరారు. నెల్లూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న ఓ ముస్లీం మహిళ మస్తాన్‌బి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పురుగులమందుతో వచ్చి ఆత్మహత్య ప్రయత్నం చేస్తే స్థానిక పోలీసులు అడ్డుకోవడం జరిగిందని సమాచారం ఎలాగో తెలుసుకుని వెంటనే అక్కడ ప్రత్యక్షమైన అజీజ్ మూడు సంవత్సరాల నుంచి మహిళా అధికారుల చుట్టూ తిరిగిందని అధికారులను విమర్శలు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. అధికారులు ఆమెకు ఎంతవరకు సహాయం చేయాలో చేస్తారు. ఆమె అమ్మ వాళ్లు అమ్మేసిన స్థలం కావాలి అంటే అధికారులు ఎలా సహాయం చేస్తారని అన్నారు. ముస్లీం మహిళను ప్రేరేపించి ఆత్మహత్య ప్రయత్నం చేయించడం వెనుక కుట్ర ఉందని ఆయన తీవ్ర స్థాయిలో ఆరోపించారు. ఒకవేళ ఆమెకు ఏదైనా ప్రాణాపాయం జరిగి ఉంటే కలెక్టర్, ఇతర అధికారులపై నిందలు వచ్చేవని, కాబట్టి ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపించి కుట్ర వెనుక ఎవరున్నారు సార్ అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అజీజ్ వల్ల టీడీపీ పార్టీ ఇప్పటికే సర్వనాశనం అయిందని, ఇతను ఆ పార్టీలో కొనసాగితే జిల్లాలో పార్టీ చిరునామా లేకుండా పోతుందని జోస్యం చెప్పారు. మరోసారి చెబుతున్న అజీజ్ సత్తార్‌ను టచ్ చేసి చూడు అని సవాల్ చేశారు.

**బహిరంగ వేలము**

శ్రీ శివ కామాక్షి పాన్ బ్రోకర్స్, పి.బి.యల్.నెం.5 రు, దా॥రామయ్య సంధు, శాంతి నగర్, బిచ్చిరెడ్డి పాళెం వారి తాలూకు కాలపరిమితి గడిచినప్పటికీ తే 04.02.20 ది నుండి తే 31.03.21 ది వరకు గల విడిపించని నగలు తే 30.11.22 ది వేలము జరుగనందున తే 01.12.22ది ఉదయం 10గం॥ ల నుండి శాంతి నగర్, బిచ్చిలో బహిరంగముగా వేలము జరుపబడును.

పి.కోటేశ్వరరావు
ప్రభుత్వం నియమించిన వేలందారు,
3-13-22బి, గుర్రంవారి వీధి, కావలి-524 201

**పాస్‌పోర్టు పోయినది**

కోసూరు రమేష్ తండ్రి చెన్నయ్య డో. నెం. 25-13-63, బి. వి. నగర్, నెల్లూరు, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా. K2577254 నెంబరు గల నా పాస్‌పోర్టు తేది 2-11-22 న నర్తకి సెంటరులో పోయినది. దొరికినవారు క్రింద కనపరచిన సెల్ నెంబరు : 80990 80999 కు తెలియపరచగలరు.

## వ్యకాసా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



**తోటపల్లిగూడూరు, నవంబరు 30 ప్రభాతవార్త:** జంగారెడ్డిగూడెంలో డిసెంబరు 8,9,10 తేదిలలో వ్యకాసా నేతలు నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక రాష్ట్ర 29వ మహాసభలను విజయవంతం చేయాలని తోటపల్లిగూడూరు మండల వ్యవసాయ కార్మిక సంఘం నేతలు బుధవారం నరుకూరులోని జక్కా వెంకయ్య స్మారక కార్యాలయం వద్ద దీనికి సంబంధించిన పోస్టరును విడుదల చేశారు. ఈసంధర్భంగా కార్మిక సంఘ నేతలు మాట్లాడారు. ప్రధానంగా వ్యవసాయ కార్మికుల కూలీల రేట్లను పెంచాలని పేద వర్గాలకు భూములు పంచాలని వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వపరంగా అన్ని రాయితీలు కల్పించాలని డిమాండ్ చేశారు. డిసెంబరు 8న జంగారెడ్డిగూడెంలో నిర్వహిస్తున్న వ్యకాసా రాష్ట్ర మహాసభలో సిపిఎం అగ్రనేతలు బృందాకారత్, విజయ రాఘవన్, బి. వెంకట్ రైతు సంఘం నాయకులు వి. శ్రీనివాసరావు తదితర ప్రధాన నాయకులు పాల్ గ ంటారని తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున ఈమహాసభలకు తరలిరావాలని పిలుపుని చ్చారు. పోస్టర్ను విడుదల చేసిన వారిలో జిల్లా వ్యకాసా అధ్యక్ష కార్యదర్శులు ఉండ్రాళ్ళ శీనయ్య, వచ్చా మధు, కాల్తిరెడ్డి రమణమ్మ, నక్కా రాధయ్య, సిపిఎం మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య, ఆటో యూనియన్ ప్రతినిధులు కృష్ణ, దయాకర్, మల్లిలు ఉన్నారు.

## తిరుపతి పార్లమెంట్ టిడిపి కన్వీనర్‌గా నాగేంద్ర



**వెంకటాచలం నవంబర్ 30 ప్రభాతవార్త:** తన పై నమ్మకం ఉంచి తిరుపతి పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ బీసి సాదికార సమితి జిల్లా కన్వీనర్‌గా అవకాశం కల్పించిన మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కుంకాల దశరధ నాగేంద్ర ప్రసాద్ సోమిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నెల్లూరు నగరంలోని టిడిపి పార్టీ కార్యలయంలో నాగేంద్ర ప్రసాద్ సోమిరెడ్డికి పుష్ప గుచ్చాం అందజేసి దన్యవాదాలు తెలిపారు. అనంతరం నాగేంద్ర ప్రసాద్ మాట్లడుతూ బీసిలను రాజకీయంగా బలోపేతం చేసి పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేయటం జరుగుతుందన్నారు. బీసిలందరికి కలుపుకోని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి చంద్రబాబు నాయదుని, ముఖ్యమంత్రిగా, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని సర్వేపల్లి ఎమ్మేల్యేగా గెలుపొందడం తద్యం అన్నారు. ఈకార్యక్రములో వెంకటాచలం మండల టిడిపి మండల అద్యక్షులు గుమ్మడి రాజా యాదవ్, రైతు విబాగం అద్యక్షులు రావూరి రాదాకృష్టమనాయదు, టిడిపి జిల్లా కార్యదర్శి నూనె లక్ష్మయ్య, తదితరులు పాల్గోన్నారు.

## పట్టబద్రులు, ఉపాద్యాయల ఓటర్ల గడుపు 9వరకు పెంపు

**వెంకటాచలం నవంబర్ 30 ప్రభాతవార్త:** పట్టబద్రులు, ఉపాద్యాయల ఓటర్లు నమోదు గడువును 9 తేది వరకు పెంచినట్లు అస్టిస్టెంట్ ఎలక్ట్రోలర్ రిజిస్టేషన్ అదికారి తెలిపారు. పట్టబద్రులకు పారం 18, ఉపాద్యాయలకు పారం 19, దరాఖస్తు చేసుకోనవచ్చును. 23,11,2022 పట్టబద్రులు, ఉపాద్యాయలు ముసాయిదా జాబితాను తహశీల్దార్, కార్యలయం, మండల పరిషత్ కార్యలయం, విద్యాశాఖ కార్యలయం, రెవిన్యూ డివిజనల్ అదికారి కార్యలయంలో జాబితాను ప్రచురించడమైనది, 119, సర్వేపల్లి నియోజకవర్గంలోని 31,10,2019, నాటికి అర్హత కలిగిన పట్టబద్రులు, పారం 18 ద్వారా నమోదు చేసుకోవచ్చును. ఉపాద్యాయ నియోజకవర్గం సంబందించి 6 సంవత్సరాలు సర్వేస్ కాలంలో 3 సంవత్సరాలు సర్వేస్ కాలం ఉపాద్యాయలుగా పనిచేసి ఉన్న ఓటరుగా నమోదు చేసుకోవచ్చును. సర్వేపల్లి నియోజకవర్గంలోని పట్టబద్రులు, మరియు ఉపాద్యాయలు 9,12,2022 లోగా నమోదు చేసుకొనవలెను. ఈ అవకాశాన్ని సర్వేపల్లి నియోజకవర్గంలోని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## విద్యార్దులను పరిక్షలకు సిద్దం చేయండి



**కలువాయి నవంబర్ 30 ప్రభాతవార్త:** డిసెంబర్ 2 నుండి జరగనున్న ఫార్మాట్యూ అసెస్మెంట్ పరీక్షలకు విద్యార్దులను సంసిద్దులు చేయాలని ఎంఇఒ జి సుదీర్‌బాబు ఉపాధ్యాయులకు తెలియజేశారు. కలువాయిలోని అరుంధతీయవాడ ఎంపిపి ఎస్‌సి పాఠశాలను బుధవారం ఎంఇఒ సందర్శించారు. ఈ సందర్భంగా మనబడి నాడు-నేడు తోపాటు చదువులు పట్ల విద్యార్దుల సామర్ధ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు తెలిపారు. నూతన మెనుతో ప్రారంభం అయిన మధ్యహ్నాం బోజనం ను ఆయన పరిశీలించి విద్యార్దులతో కలిసి బోజనం చేశారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వై తిరుపతమ్మ, ఉపాధ్యాయులు కసిరెడ్డి పెంచలమ్మ, సిఆర్‌పి మహేష్ ఉన్నారు.

## రాష్ట్రస్థాయి చదరంగం విజేతలు,రిషి మనోహార్, గోడ్టేటి హిమ తేజశ్వని



**బుచ్చి నవంబర్ 30 ప్రభాతవార్త** గత రెండు రోజులుగా గుంటూరు జరుగుతున్నటువంటి రాష్ట్రస్థాయి ఓపెన్ మరియు మహిళల టీం చదరంగం చాంఫియన్ షిప్ పోటీలలో నెల్లూరు జిల్లా క్రీడాకారులు చాత్తా చాటుకున్నారు. ఓపెన్ విభాగంలో ఎం .రిషి మనోహార్ (నెల్లూరు) చాంఫియన్,మహిళల టీం చాంఫియన్ షిప్ నందు హిమ తేజస్వినీ (బుచ్చిరెడ్డిపాళెం) ద్వితీయ స్ధానం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకొని రావడం జరిగింది. ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శర్మ, కోశాధికారి జ్వాలాముఖి,వైస్ ప్రెసిడెంట్ పి మస్తాన్‌బాబు వారిని ప్రత్యేకంగా అభినందించారు. గెలుపొందిన క్రీడాకారులు జాతీయ స్ధాయిలో ప్రతిభ చాటి జిల్లాకు,రాష్ట్రానికి పేరు తీసుకొని రావాలని కాంక్షించారు.నెల్లూరు చెస్ అసోసియేషన్ నిర్వహించిన అన్ని జిల్లా స్ధాయి పోటీలలో పాల్గొని ప్రతిభను మెరుగు పరచుకున్నానట్లు క్రీడాకారులు తెలిపారు. నెల్లూరు చెస్ అసోసియేషన్ కార్యదర్శికి ప్రత్యేకంగా తమ కృతజ్ఞతలు తెలిపారు.అలాగే చెస్ కోచ్ వేముల ప్రదీప్‌ను కూడా పలువురు అభినందించారు.

## సంక్షేమ పథకాలే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేస్తాయి



**బిట్రగుంట, నవంబరు 30 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేస్తాయని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన బోగోలు పంచాయతీలో బుధవారం బిట్-3 సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్బంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా ఏ మేరకు లబ్దిచేకూరుతుంది అనే విషయంపై ఆయన ఆరా తీశారు. దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయనన్ని సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రజలకు అందించడమే కాకుండా ఎన్నికల హామీలను 98 శాతంకు పైగా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో వచ్చిన వినతులను పరిశీలించి ప్రతి సచివాలయ పరిధిలో పది లక్షల రూపాయలు ప్రాధాన్యత పనులు గుర్తించి అమలు చేయడం జరుగుతుందన్నారు. బోగోలులో అధిక శాతం లబ్దిదారులు గృహ నిర్మాణాలకు నోచుకోకపోతే వారందరికి జగనన్న లేఅవుట్లలో స్థలం ఇచ్చి పక్కా గృహాలు నిర్మించడం జరుగుతుందన్నారు. త్వరలో ఈ గృహాలకు గృహప్రవేశాలు నిర్వహిస్తామన్నారు. అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి ప్రతిపక్షాలు లేనిపోని రాద్దాంతం చేస్తున్నాయన్నారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, ఎంపిపి మేకల సుజాత, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, ప్రజాప్రతినిధులు, వైసిపి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

## వాహనాల వేలంపాట ద్వారా ప్రభుత్వానికి ఆదాయం



**కోవూరు, నవంబరు 30 ప్రభాతవార్త :** కోవూరులోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయంలో సెబ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివిధ కేసుల్లో సీజ్ చేసిన 12 మోటార్ సైకిళ్లను, ఒక ఆటోను బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంపాటను ఏఈఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి పర్యవేక్షణలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 12 వాహనాలకు గానూ 9 వాహనాలు మాత్రమే బహిరంగ వేలంలో వేలంపాట దారులు కైవసం చేసుకున్నారన్నారు. ఈ వాహనాలకు ప్రభుత్వం 80,800 ధర నిర్వహించగా వేలంపాటలో రూ.1,17,100లు వచ్చిందన్నారు. ఇది కాక 12 శాతం జీఎస్టీ కూడా ప్రభుత్వానికి అదనంగా ఆదాయం చేకూరిందన్నారు. మూడు వాహనాలను మాత్రం వేలంపాటలో ఎవరూ కొనుగోలు చేయలేదని, ఉన్నతాధికారుల నుంచి ఆదేశాల వచ్చిన తర్వాత ఈ వాహనాలకు డిసెంబర్‌లో వేలం వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఎస్సైలు శ్రీధర్, శ్రీనివాస్, అశోక్‌కుమార్, తిరుపాల్, తదితరులు ఉన్నారు.

## ప్రతిభ చూపిన పోలీసులకు రివార్డులు



**కోవూరు, నవంబరు 30 ప్రభాతవార్త :** కోవూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిందితును అరెస్టు చేయడంలో చొరవ చూపిన కోవూరు ఎస్సై డి. వెంకటేశ్వరరావు, సిబ్బందిని అభినందించడమే సకాలంలో అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన వారికి జిల్లా ఎస్పీ విజయరావు ఆదేశాల మేరకు రివార్డులను అందజేయడం జరిగిందని రూరల్ డీఎస్పీ పి. వీరాంజనేయరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ చూపిన కోవూరు ఎస్సై డి. వెంకటేశ్వరరావు,, ఏఎస్సై కె. సత్యనారాయణ, పోలీసులు పి. సునీల్‌కుమార్,, హెడ్ కానిస్టేబుల్ ఎస్కే రషీద్‌లను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రావార్డులు అందజేశారు. కోవూరు సీఐ కె. రామకృష్ణారెడ్డి, ఎస్సై డి. వెంకటేశ్వరరావులు ఉన్నారు.

## మెప్మాలో బాగా పని చేస్తున్న సమైక్యలకు ప్రశంసలు



**నెల్లూరు టౌన్, నవంబరు 30, ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ పరిధిలో బాగా పని చేసిన సమైక్యలకు జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ డి.రవీంద్ర ప్రశంసల జల్లు కురిపించారు. జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం అర్బన్ జిల్లా సమైక్య సమావేశంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ డి.రవీంద్ర పాల్గొని సమైక్యల పనితీరును విశ్లేషించారు. జిల్లా సమైక్యలు గతంలో పని చేసిన సి.హెచ్.కవిత, ఎన్.పెంచలమ్మ, శోభారాణి, విష్ణుప్రియ తదితరులు బాగా పని చేశారని కొనియాడారు. అదేవిధంగా కొత్తగా ఏర్పడిన జిల్లా సమైక్యలు తమ వంతు కృషిగా ఇంకా సమైక్యాన్ని ముందుకు నడిపించాలని సూచించారు. అలాగే మెప్మా యొక్క ప్రతిష్టను పెంచుటలో ఇప్పటివరకు నాయకత్వం వహించిన వారు బాగా పని చేసి, మన పని యొక్క జిల్లా ప్రతిష్టను జిల్లా నలుమూలలకు విస్తరించేలా కృషి చేశారని, ప్రస్తుం అధ్యక్షురాలిగా ఉన్న జ్యోతి, భవాని, శాంతి తదితరులు కూడా మంచిగా పని చేసి మన ప్రగతిని ఉన్నత స్థాయికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి.ఈ వంకదారి అంకయ్య, సుధాకర్, హర్షిత, అన్ని పట్టణ సమైక్య అధ్యక్షులు టి.ఎల్.ఎఫ్, ఆర్‌పీలు పాల్గొన్నారు.

## సంగం పోలీస్‌స్టేషన్ తనీకి చేసిన డిఎస్‌పి కోటారెడ్డి



**సంగం నవంబర్ 30 ప్రభాతవార్త** సంగం పోలీస్‌స్టేషన్‌ను ఆత్మకూరు డిఎస్‌పి కోటారెడ్డి పరిశీలించారు. డివిజన్ పరిధిలోని చోరీలు,రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. అలాగే నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో ఆయన వెంట సిఐ రవికుమార్, ఎస్ఐ నాగార్జునరెడ్డి,సిబ్బంది ఉన్నారు.

## మనస్థాపంతో పురుగుమందు తాగి వ్యక్తి మృతి



**కావలి రూరల్, నవంబరు 30 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలం రాజువారిచింతలపాళెం గ్రామానికి చెందిన పేముల రవి(37) మనస్థాపంతో పురుగుమందు తాగి మృతి చెందాడు. కావలి రూరల్ పోలీసుల సమాచారం మేరకు పేముల రవికి 15 సంవత్సరాల క్రితం కావలి మండలం రాజువారిచింతలపాళెం గ్రామానికి చెందిన సుజాతతో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. మృతుడు రవి బేల్దారి పనిచేసుకొని జీవనం సాగిస్తున్నాడు. తాగుడికి బానిసై భార్య సుజాతతో గొడవలు జరగడంతో ఆమె పుట్టింటికి పిల్లలతో సహా వెళ్లిందని తెలిపారు. కాపురానికి రమ్మని రవి భార్య సుజాతను అడుగగా ఆమె రానని చెప్పడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం పురుగు మందు తాగాడని తెలిపారు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారని తెలిపారు. పేముల రవి బుధవారం మృతి చెందాడని తెలిపారు. మృతుడు తండ్రి పేముల పోలయ్య ఫిర్యాదు మేరకు కావలి రూరల్ ఎస్ఐ వీరేంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పశుసంపదతో పాడి పరిశ్రమను పెంచాలి



**ఇందుకూరుపేట నవంబర్ 30 ప్రభాతవార్త** ఒంగోలు మేలు జాతి ఆవుల ద్వారా పశుసంపదతో పాడి పరిశ్రమను పెంచాలని డిఎల్‌డిఎ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని కొరుటూరు గ్రామ రైతులకు 40 వేల రూపాయాలు విలువ చేసే కోడె దూడలను ఉచితంగా పంపిణి చేశారు.ఈ సందర్బంగా జిల్లాలో డిఎల్‌డిఎ ద్వారా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ఘణాంకాలతో వివరించారు . ఈకార యక్రమంలో ఇఒ సోమయ్య,డాక్టర్ నరేష్,డిఎల్‌డిఎ డైరక్టర్లు, బి వెంకటరమణ, మల్లికార్జున పాల్గోన్నారు.

## రోడ్డు భద్రతానియమావళిపై విద్యార్ధులకు అవగాహన



**నెల్లూరు,నవంబరు30 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్థానిక వనంతోపు సెంటర్‌లోని శ్రీచైతన్య పాఠశాల ప్రధాన శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఇన్‌చార్జ్ ఆర్‌టిఓ మురళీమోహన్ పాల్గొని మాట్లాడారు. వాహనదారులతోపాటూ ప్రజలు కూడా రోడ్డు నియమాలు పాటిస్తే ప్రమాదాల శాతాన్ని గణనీయంగా తగ్గించవచ్చన్నారు. వాహనాలకు క్రమం తప్పకుండా సర్వీసులు చేయంచటం ద్వారా కాలుష్యాన్ని అరికట్టవచ్చని పేర్కొన్నారు. విద్యారు ్ధలకు చిన్నతనం నుండే ట్రాఫిక్ రూల్స్, రోడ్డు నియమాలపై అవగాహన కలిగి ఉండటం అవసరమన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్ధులు కొండాయపాళెం సెంటర్‌లో ప్లకార్డులు చేతబూని ర్యాలీని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వి.కల్పన, సిబ్బంది ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీకాలేజి అభివృద్ధిపై ప్రత్యేక చొరవ



**కోవూరు నవంబర్ 30 ప్రభాతవార్త** కోవూరు మండలంలోని నేతాజి నగర్‌లో ఉన్న వైకెఆర్అండ్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృది ్ధకి ప్రత్యేక చొరవ తీసుకునేలా దృష్టి పెడతామని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. డిగ్రీ కళాశాల అభివృద్ధి కమీటి సమావేశం బుదవారం కళాశాలలో నిర్వహించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు కళాశాల అభివృద్ధికి ప్రభుత్వ పరంగా ఎమైనా కావాలంటే ఆవిషయాలను కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి దృష్టికి తీసుకొని వెళతానని అన్నారు.ఈ సందర్బంగా కళాశాల అభివృద్ధికి పలుసూచనలు చేశారు.ఈకార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యురాలు శ్రీలత, ఐటెక్‌పార్కా అధినేత రమణారెడ్డి, కళాశాల ప్రిన్సిఫల్ లక్ష్మీ ప్రసూనా. విద్యావిభాగం నాయకులు సాయి, అద్యాపకులున్నారు.

## ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డిఎంహెచ్‌ఓ

**నెల్లూరు నవంబర్ 30, ప్రభాతవార్త-వైద్యం** యూకో నగర్‌లో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ కేంద్రంలోని ఉద్యోగుల హాజరు పట్టికను, రికార్డులను పరిశీలించారు.

## మాజీ సర్పంచ్ వెంకురెడ్డి పార్దీవదేహానికి ఎంపి ఆదాల, ఎమ్మెల్యే ఆనం నివాళులు



**మనుబోలు, నవంబరు 30 ప్రభాతవార్త** మనుబోలు మాజీ సర్పంచ్, వైసిపి సీనియర్ నాయకులు బొమ్మిరెడ్డి వెంకురెడ్డి పార్థీవదేహానికి నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిలు బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనారోగ్యంతో వృద్దాప్యంలో బొమ్మిరెడ్డి వెంకురెడ్డి స్వర్గస్తులైన విషయం తెలిసిందే. ముందుగా వెంకురెడ్డి నివాసానికి ఎమ్మెల్యే ఆనం విచ్చేశారు. ఆయన కుమారులు వైసిపి మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, ధనుంజయరెడ్డిని పరామర్శించారు. అనంతరం నెల్లూరు ఎంపి ఆదాల బొమ్మిరెడ్డి నివాసానికి చేరుకున్నారు. అదే సమయంలో ఆయన కుమారులు, పార్టీ నాయకులతో వెంకురెడ్డితో తనకువున్న అనుబందాన్ని జ్ఞాపకం చేసుకున్నారు. ఆయన వెంట విజయా డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రైల్వే బోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య, ఇందుకూరుపేట మార్కెటింగ్ కమిటీ చైర్మన్ గునపాటి రమేష్‌రెడ్డి, వైసిపి నాయకులు కోటిరెడ్డిలు పాల్గొన్నారు. వైసిపి నాయకులు చేరెడ్డి పట్టాభిరామిరెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, ఏడం మల్లికార్జునరెడ్డి, సొసైటీ అధ్యక్షులు మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, పలువురు నాయకులు ఆయనకు నివాళులర్పించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం బొమ్మిరెడ్డి నివాసానికి రానున్నట్లు సమాచారం.బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు పార్టీ నాయకులు, బంధువులు, స్నేహితులు, బంధువులు సమక్షంలో అంత్యక్రియలు ముగిశాయి.

## విద్యకు పెద్దపీట వేస్తున్న సియం జగన్మోహన్‌రెడ్డి




**కావలి, నవంబరు 30 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ విద్యార్థుల జీవితాలలో వెలుగు నింపుతున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కావలి పట్టణంలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో బుధవారం జగనన్న విద్యాదీవెన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొని 2021-22 సంవత్సరానికి గాను 4వ త్రైమాసికానికి సంబంధించి 6 వేల 455 మంది విద్యార్థులకు 4 కోట్ల 17 వేల లక్షల 175 రూపాయల చెక్కును విద్యాదీవెన కింద అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో విద్యకు పెద్దపీట వేశారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టి విద్యార్థులను ఆదుకున్నారన్నారు. రాజశేఖర్‌రెడ్డి బాటలో ఆయన తనయుడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఒక అడుగు ముందుకు వేసి విద్యకు అధిక నిధులు వెచ్చిస్తూ విద్యార్థుల అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు.జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా గద్దెనెక్కిన తర్వాత దాదాపు 50 వేల కోట్ల రూపాయలు విద్యార్థుల అభ్యున్నతికి ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చేసిన ఘనత జగనన్నకు దక్కిందన్నారు. విద్యార్థుల ఉన్నత చదువులు చదువుకోవాలంటే ఇంగ్లీషు ఎంతైనా అవసరమని భావించి పాఠశాల స్థాయిలో సిబిఎస్ సిలబస్‌ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. వైసిపి పాలనలో విద్య, వైద్యం, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. రాష్ట్రంలో ప్రతి రంగంలో మహిళలకు, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలకు అధిక ప్రాధాన్యత కల్పించారన్నారు. తనకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బెజవాడ రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన విద్యా దీవెనలో పాల్గొనడం చాలా సంతోషంగా వుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో, అంకితభావంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కావలి మున్సిపల్ కమిషనర్ బి.శివారెడ్డి, ఎంపిడివో అమ్మిశెట్టి వెంకట సుబ్బారావు, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బెజవాడ రవికుమార్, డైరెక్టర్ జానకిరాం,బిసి వెల్ఫేర్ అధికారి సుధాకర్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి పెంచలయ్య, జెడ్పీటీసీ సభ్యులు జంపాని రాఘవులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాగులవెలటూరులో డియస్పీ విచారణ



**చేజర్ల,నవంబర్30ప్రభాతవార్త:** చేజర్ల మండలం నాగులవెలటూరుకు చెందిన జంగం దేవేంద్రకుమార్‌పై అదే గ్రామానికి చెందిన దౌపాటి రవితేజ కులంపేరుతో దూషించడంతోపాటు దాడిచేశాడని పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆత్మకూరు డియస్పీ కోటారెడ్డి బుధవారం నాగులవెలటూరులో విచారణ జరిపారు. గ్రామానికి చెందిన దేవేంద్రకుమార్ కాలనీలో తమ ఇళ్ళ వద్ద ఉన్న ఓ అరుగుపై కూర్చొని అయ్యప్పదీక్షలో ఉంటూ మొబైల్‌లో అయ్యప్పస్వామి పాటలు వింటుండగా కాలనీలో మరో వ్యక్తితో అవసరమై ఉండి అక్కడకు వచ్చిన రవితేజ అతనికి అవసరమైన వ్యక్తి గురించి వాకబుచేశాడు . ఆ అబ్బాయి పనికి వెళ్ళాడని దేవేంద్ర కూర్చొని సమాధానం ఇవ్వడంతో ఆగ్రహించిన రవితేజ కూర్చొని సమాధానం చెబుతావా అంటూ కులంపేరుతో దూషించడంతోపాటు దాడి చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు డియస్పీ కోటారెడ్డి గ్రామంలో విచారణ చేపట్టారు. ఈయనవెంట సంగం సిఐ రవినాయక్ , చేజర్ల పోలీసులు ఉన్నారు.

## కలుజులో పడి వ్యక్తి మృతి

**కావలి రూరల్, నవంబరు 30 ప్రభాతవార్త** కావలి పట్టణం సంకులవారితోటకు చెందిన నవుడుబోయిన వెంకట రమణయ్య(47) కలుజులో పడి మృతి చెందాడు. కావలి రూరల్ పోలీసుల వివరాలు మేరకు కావలి సంకులవారితోటకు చెందిన నవుడుబోయిన వెంకట రమణయ్య గొర్రెలు కాచుకొని జీవిస్తున్నాడు. ఆయన భార్య విజయమ్మ గేదెలు కాచుకొని పాలు అమ్ముకుంటుండేదని తెలిపారు. మృతుడు వెంకట రమణయ్య రెండు రోజుల క్రితం గొర్రెలు తాలూకా డబ్బులు రావాలని తెస్తానని చెప్పి కావలి రూరల్ మండలం మోర్లవారిపాళెం గ్రామానికి వెళ్లాడని తెలిపారు. ఎంతకీ తిరిగి రాలేదు. బుధవారం కావలి రూరల్ మండలం మోర్లవారిపాళెం గ్రామ సమీపాన మన్నంగిదిన్నె డంపింగ్ యార్డు వద్ద గల కలుజులో బహిర్భూమికి అని దిగి నీళ్లలో పడిపోయినట్లు మృతుడు కుమారుడు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కావలి రూరల్ ఎస్ఐ వీరేంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.